AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

నామినేషన్లు షురూ..

3

2

పొలంలో కలుపు తీసిన విద్యార్థులు

ప్రధానోపాధ్యాయురాలు సస్పెన్షన్..

అక్షరటుడే, ఇందూరు: ఎన్నికల విధులకు గైర్హాజరైన ఆర్మూర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్మూర్‌లోని 4, 5, 6 వార్డుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో)గా ప్రధానోపాధ్యాయురాలు వనజా రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా ఎన్నికల విధులకు గైర్హాజరయ్యారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి వచ్చింది. దీంతో ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్ఎం వనజా రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ ఉత్తర్వులు జారీ చేశారు.

బాన్సువాడలో డబ్ల్యూహెచ్‌వో సెంట్రల్ టీం తనిఖీలు

అక్షరటుడే, బాన్సువాడ: పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిని బుధవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ సెంట్రల్ టీంకు చెందిన డాక్టర్ పర్వేజ్ సుల్తానా సందర్శించారు. ఆస్పత్రిలోని పిల్లల వార్డు, డీఈఐసీ, ఎన్ఆర్‌సీ, ఎస్ఎన్‌సీయూ కేంద్రాలను తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం సంబంధిత విభాగాల అధికారులు, వైద్యులతో డాక్టర్ పర్వేజ్ సుల్తానా సమావేశం నిర్వహించారు. పిల్లలకు ఎక్కువగా వచ్చే వ్యాధులు, వాటికి అందిస్తున్న చికిత్సలు, సేవల నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ప్రత్యేక చికిత్సా విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయ భాస్కర్, ఆర్ఎంవో సుజాత, డిప్యూటీ డీఎంహెచ్వో రోహిత్, సీహెచ్‌వో దయానంద్, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షరటుడే, ఇందూరు : ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలోని కంఠేశ్వర్ మున్సిపల్ జోన్ కార్యాల, టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి వెంటవెంటనే రోజువారిగా టీపోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్‌డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సంబంధిత మున్సిపాలిటీ పరిధిలోని ఏదైనా డివిజన్/వార్డు ఓటరుగా నమోదై ఉంటే సరిపోతుందన్నారు. ప్రతిపాదకులు మాత్రం అదే డివిజన్‌కు చెందిన ఓటరై ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచామని, నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి కొనసాగుతున్న నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి రోజు ఆయా డివిజన్‌లో వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు తదితరులున్నారు.

మున్సిపల్ ఎన్నికల నిరీక్షణకు తెరపడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో ప్రధాన పార్టీల్లో కోలాహలం మొదలైంది. ఇప్పటికే పలువురు ఆశావాహులు సంబంధిత వార్డుల్లో పోటీ చేసేందుకు ఆయా పార్టీలకు దరఖాస్తులను అందజేశారు. పార్టీలు సైతం ధీటైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నాయి. నామినేషన్లకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో బీఫాం ఎవరికి వస్తుందోనన్న ఉత్కంఠలో ఆశావహులు ఉన్నారు.

– అక్షరటుడే, ఇందూరు

ధీటైన అభ్యర్థి ఎవరు..?

■ కసరత్తు చేస్తున్న ప్రధాన పార్టీలు ■ అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు ■ ఆశావహుల ప్రయత్నాలు

జిల్లాలో నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలో ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే పలువురు ఆశావాహులు కౌన్సిలర్, కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో వార్డులో ఒక్కో పార్టీకి పదుల సంఖ్యలో ఆశావాహులు ఉన్నారు. దీంతో ఆయా పార్టీల నేతలు బలమైన అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో పడ్డారు. ప్రధానంగా గెలుపు గుర్రాలను బరిలోదించేందుకు కసరత్తు ప్రారంభించారు. రెండు రోజుల సమయం మాత్రమే ఉండటంతో నేతలంతా భేటీ అయ్యారు.

హైదరాబాద్‌కు పార్టీ పెద్దలు..

కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం జిల్లా నేతలు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆశావాహుల దరఖాస్తులను వడపోసి బలమైన అభ్యర్థిని ఎంపిక చేసేందుకు రాష్ట్ర నాయకుల దగ్గరికి చేరుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాతో పాటు ఎంపిక కమిటీ నేతలు ఎంపీ ధర్మపురి అర్వింద్ వద్దకు వెళ్లినట్లు సమాచారం. ఎంపీ నేతృత్వంలో వార్డులు డివిజన్ల వారీగా అభ్యర్థిని ఎంపిక చేసి రాష్ట్ర కార్యాలయానికి జాబితాను చేరవేయనున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్‌లో సైతం బలమైన నేతల కోసం నాయకులు వెతుకుతున్నారు.

పెరిగిన ఆశావహుల సంఖ్య..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఎన్నికల్లో పార్టీకి ఆశావాహుల సంఖ్య పెరిగింది. దీంతో జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి ఇతర నాయకులు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వద్దకు చేరుకున్నట్లు సమాచారం. ఈసారి మేయర్ పీఠం కైవసం చేసుకునేందుకు బలమైన అభ్యర్థిని పోటీలోకి దించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. అలాగే నిజామాబాద్ బోధన్‌లోని మైనారిటీ ఏరియాలో ఎంఐఎం బలంగా ఉంది. దీంతో ఆశావాహులు సైతం ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. వారి ఎంపిక కోసం జిల్లా నేతలు తుది జాబితా ఖరారు చేసేందుకు రాష్ట్ర రాజధానికి వెళ్తున్నట్లు సమాచారం. ఇక ఆర్మూర్, భీమ్‌గల్ ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ఆశావాహుల పోటీ తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

మీ సేవ కేంద్రాల్లో సందడి..

పోటీచేసే అభ్యర్థులకు కావాల్సిన పత్రాల కోసం మీ సేవ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాలు సందడిగా మారాయి. కుల, ఆదాయ పత్రాలు, నోడ్యూ తదితర పత్రాల కోసం అభ్యర్థులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆశావహులు మాట్లాడుతూ.. తమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరుతున్నారు. భారీగా దరఖాస్తులు రావడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

బీఫాంల కోసం ఎదురుచూపులు..

ఏదైనా పార్టీ నుంచి పోటీ చేయాలంటే సంబంధిత పార్టీ బీఫాం తప్పనిసరి. అయితే ఈసారి నిజామాబాద్ కార్పొరేషన్ లో అన్ని పార్టీలకు ఆశావాహుల పోటీ తీవ్రంగానే ఉంది. నామినేషన్ల స్వీకరణకు కేవలం మూడు రోజులు మాత్రమే ఉండడంతో అభ్యర్థులు నామినేషన్లను అందజేసేందుకు సిద్ధమయ్యారు. పార్టీ నుంచి బీఫాంలను మరో ఒకటి రెండు రోజుల్లో అందజేసే అవకాశం ఉండడంతో ప్రస్తుతానికి ఆశావాహులంతా నామినేషన్లను వేయనున్నారు. ఈనెల రెండు లోపు బీఫాంలను అందజేస్తే సంబంధిత పార్టీ అభ్యర్థిగా పరిగణిస్తారు. ఈ లెక్కన గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం వరకు బీ ఫాంలను అందజేసే అవకాశం ఉందని అభ్యర్థులు చర్చించుకుంటున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వాత పెట్టాలి: వీజీ గౌడ్

అక్షరటుడే, కామారెడ్డి : ప్రస్తుతం జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించి, కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టాలని మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. పట్టణంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు, అమలు కాని హామీలు ఇచ్చి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, ప్రజలు కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతుబంధు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. తులం బంగారం మాట పక్కన పెట్టారని, ఇచ్చిన ఏ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించార.ఉ కామారెడ్డి జిల్లా అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. కామారెడ్డి జిల్లా ఏర్పాటు డిమాండ్‌లో ఉన్నా ఏ నాయకుడు పట్టించుకోలేదని, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో జిల్లా ఏర్పాటైందని గుర్తుచేశారు. గడిచిన రెండేళ్లలో కామారెడ్డిలో అభివృద్ధి జరగలేదన్నారు. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే హామీ ఇచ్చిన రూ.150 కోట్ల అభివృద్ధి ప్రణాళిక అటకెక్కిందని, దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబోద్దీన్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ సెంటర్‌ను తనిఖీ చేసిన సీపీ సాయిచైతన్య

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం : మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ సెంటర్‌ను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. నాల్గో టౌన్ పరిధిలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సీపీ పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ సెంటర్ల సమీపంలో 100 మీటర్లలోపు నిషేధిత ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ బి. ప్రకాష్, నాల్గో టౌన్ ఎస్‌హెచ్‌వో సతీష్ కుమార్, ఆర్‌వో వెంకటేష్, ఏఆర్‌వో రమేష్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి

అక్షరటుడే, బాన్సువాడ : నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సౌమ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం సౌమ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సౌమ్య త్వరగా పూర్తిగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షిస్తున్నట్లు పోచారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాక..

అక్షరటుడే, ఇందూరు: మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన తెలంగాణ టెక్నలాజికల్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ సత్యనారాయణ రెడ్డి బుధవారం కలెక్టరేట్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్క అందించి కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వాగతం పలికారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ ఇలా త్రిపాఠి అబ్జర్వర్‌కు తెలియజేశారు. నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జనరల్ అబ్జర్వర్ కు ఫిర్యాదులు, సూచనలు చేయదలచిన వారు 95533 95000కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు. అలాగే mngdirectortgts@telangana.gov.in ద్వారా కూడా తెలుపవచ్చని ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి సూచించారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నోడల్ ఆఫీసర్ ఫర్ మైక్రో అబ్జర్వర్ సునీల్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ మున్సిపల్ జోన్ ఆఫీస్, పూలాంగ్ టీటీడీ కల్యాణ మండపం, గౌతంనగర్, గోల్ హనుమాన్ వాటర్ ట్యాంక్, బడా బజార్ వాటర్ ట్యాంక్ తదితర కేంద్రాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. నిబంధనలకు అనుగుణంగా స్వీకరణ ప్రక్రియ జరుగుతోందా అని తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హెల్ప్ డెస్క్‌లను పరిశీలించారు.

నామినేషన్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు : ప్రశాంత్ రెడ్డి

అక్షరటుడే, కామారెడ్డి: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల్లో పోలీసుల బందోబస్తు, పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రశాంత్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. మొదటి నామినేషన్ కేంద్రం రెవెన్యూ సెక్షన్‌లో ఏర్పాటు చేశారు. అక్కడ 1 నుంచి 15 వార్డుల నామినేషన్లు తీసుకుంటున్నారు. అలాగే రెండో నామినేషన్ కేంద్రం కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో 16 నుంచి 45 వార్డుల నామినేషన్లు, మూడో నామినేషన్ కేంద్రాన్ని అకౌంట్స్ సెక్షన్‌లో ఏర్పాటు చేశారు. అక్కడ 46 నుంచి 49 వార్డుల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులకు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. అన్ని నామినేషన్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, డిజిటల్ వాచ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, తహశీల్దార్ జనార్దన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రోటవేటర్ల అందజేత

అక్షరటుడే, బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో బుధవారం రైతులకు సబ్సిడీపై రోటవేటర్లను పంపిణీ చేశారు. ఏఈవో మీనా, సర్పంచ్ అరిగే ధర్మతేజ చేతుల మీదుగా ఇద్దరు రైతులకు రోటవేటర్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరిగే ధర్మతేజ మాట్లాడుతూ.. బీర్కూర్ మండలంలో మొత్తం తొమ్మిది మంది రైతులకు సబ్సిడీ రోటవేటర్లు మంజూరయ్యాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఇద్దరు రైతులకు వాటిని అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభాసాటిగా మార్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, చామకూర రాజు, నర్సోజి, రైతులు కిషోర్ బాబు, పెండ్యాల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు డీటీపీతో ఉపాధి

అక్షరటుడే, ఇందూరు: తెలుగును సాంకేతికంగా కంప్యూటర్లలో వాడుతూ.. తెలుగు డీటీపీతో ఉపాధి అవకాశాలు పొందవచ్చని గిరిరాజ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం తెలుగు టైపింగ్ టూల్స్ అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో కంప్యూటర్‌లో తెలుగుకు కూడా ప్రాధాన్యం పెరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగరత్నం, కోర్స్ సమన్వయకర్త లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి అకడమిక్ కోఆర్డినేటర్ నహీదా బేగం, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన ఉండాలని మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఉదయ్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి రహదారి భద్రతకు ప్రచారకర్తగా మారాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు ప్రాథమిక రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలను కాపాడడంలో 'గోల్డెన్ అవర్' అత్యంత కీలకమని వివరించారు. ఆ సమయంలో సాయపడే వ్యక్తులను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డుభద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. రహదారి భద్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు, ఇన్‌ఛార్జి నాగరాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో మున్సిపల్ కార్యాలయాలు అభ్యర్థుల రాకతో సందడిగా మారాయి. నామినేషన్ల స్వీకరణకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. నామినేషన్ల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– అక్షరటుడే, కామారెడ్డి

నామినేషన్లు షురూ..

■ కోలాహలంగా మారిన మున్సిపల్ కార్యాలయాలు ■ ఏర్పాట్లు చేసిన అధికారులు ■ తొలిరోజు 44 నామినేషన్లు దాఖలు

ఉమ్మడి జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు, ఒక కార్పోరేషన్‌కు వచ్చేనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ నగర కార్పోరేషన్‌లో 60 డివిజన్లు, ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 వార్డులు, బోధన్ మున్సిపాలిటీలో 38, భీమ్‌గల్ మున్సిపాలిటీలో 12 వార్డులు, కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి మున్సిపాలిటీలో 49, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 12, బాన్సువాడ మున్సిపాలిటీలో 19, బిచ్కుంద మున్సిపాలిటీలో 12 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

కోలాహలంగా మున్సిపాలిటీలు..

ఎన్నికల నిర్వహణకు నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో ఆయా మున్సిపల్ కార్యాలయాలు అభ్యర్థుల రాకతో సందడిగా మారాయి. నామినేషన్‌కు కావాల్సిన పత్రాలు, ఇతరత్రా వివరాలను తెలుసుకున్నారు. అభ్యర్థితో పాటు తమను బలపర్చే వ్యక్తికి సంబంధించిన నోడ్యూ సరిఫికెట్ తీసుకోవడానికి క్యూ కట్టారు.

డమ్మీ అభ్యర్థుల నామినేషన్లు

మున్సిపల్ ఎన్నికలు పార్టీల గుర్తుల తో సాగనుండటంతో ఆశావహుల మదిలో ఆందోళన నెలకొంది. టికెట్ వస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఏదైనా కానీ అని నామినేషన్ అయితే వేస్తున్నారు. బీఫాం లేకుండా పలువురు డమ్మీ నామినేషన్లు కూడా వేస్తున్నారు. గురువారం, శుక్రవారం బీ ఫాంలతో నామినేషన్స్ దాఖలు చేయనున్నారు. టికెట్ పక్కా అనుకున్న పలువురు అభ్యర్థులు ఒక సెట్ నామినేషన్ బీ ఫాంలు లేకుండానే వేస్తున్నారు. బీఫాం వచ్చిన తర్వాత మరొక సెట్ దాఖలు చేయనున్నారు.

చివరి రోజు సందడిగా..

నామినేషన్ల స్వీకరణ శుక్రవారం పూర్తి కానుంది. పలువురు స్వతంత్ర అభ్యర్థులు, ఇతర నాయకులు బుధవారం మంచిరోజు కావడంతో మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించిన మున్సిపాలిటీ ఇన్‌ఛార్జీలు అభ్యర్థులను ఎంపిక చేసి వారికి బీఫాం అందజేయనున్నారు. చివరి రోజు అత్యధిక మంది అభ్యర్థులు నామినేషన్ వేయనున్నట్టుగా తెలుస్తోంది.

మొదటి రోజు 44 మంది..

ఉమ్మడి జిల్లాలో తొలిరోజు మొత్తం 44 నామినేషన్లు వచ్చాయి. నిజామాబాద్ కార్పొరేషన్‌లో 13, ఆర్మూర్‌లో ఐదు, భీమ్‌గల్‌లో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బోధన్‌లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కామారెడ్డిలో 14 నామినేషన్లు, బాన్సువాడలో 3, బిచ్కుందలో 3, ఎల్లారెడ్డిలో 2 నామినేషన్లు దాఖలయ్యాయి.

అధికార పార్టీలో రెబల్స్..

జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో ముఖ్య నాయకులకు రెబల్స్ బెడద తప్పేలా కనిపించడం లేదు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో చాలా మంది టికెట్ వస్తుందని ఆశతో ఉన్నారు. వారికి టికెట్ రాని పక్షంలో రెబల్స్‌గా నామినేషన్ వేసే అవకాశాలు ఉన్నాయి. కామారెడ్డి మున్సిపాలిటీలో అత్యధికంగా రెబల్స్ నామినేషన్లు వేసే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ రెండు వర్గాలు ఉన్నట్టుగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఓ వర్గం అభ్యర్థికి బీఫాం ఇస్తే మరొకవర్గం అభ్యర్థి రెబల్‌గా పోటీలో ఉండే అవకాశం ఉంది.

విద్యతోనే వికాసం.. క్రీడలతో ఉల్లాసం

అక్షరటుడే, భీమ్‌గల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే సంపూర్ణ వికాసం సిద్ధిస్తుందని భీమ్‌గల్ ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని బాబాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం 'సీఎం కప్2026' మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని యువతకు పిలుపునిచ్చారు. తొలిరోజు బుధవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఆటపాటలతో పాఠశాల ఆవరణ కోలాహలంగా మారింది. గురువారం కబడ్డీతో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి, వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎంఈవో స్వామి, ఎంపీవో జావీద్, సర్పంచ్‌లు సమీర్, రమేష్, శేఖర్, ఉపసర్పంచ్ గోవర్ధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, పీడీలు భూపతి, చిన్నయ్య పాల్గొన్నారు.

బాల్కొండ జెడ్పీహెచ్ఎస్‌లో వ్యాసరచన పోటీలు

అక్షరటుడే, బాల్కొండ: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'జంతు సంక్షేమం - పౌరుడి బాధ్యత'' అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి గంగాధరయ్య విద్యార్థులతో మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే జంతువులను ఎలా సంరక్షించాలి.. వాటి ఆరోగ్యంపై మన బాధ్యత ఏమిటి అనే అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

అక్షరటుడే, ముప్కాల్: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను సర్పంచ్ కొమ్ముల సాయవ్వ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో భాగంగా మంజూరైన రూ.75 లక్షలతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శబరిమల అన్నదాన సత్రంలో లక్కీ డ్రా

అక్షరటుడే, బాన్సువాడ: శబరిమలలో అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్, తత్త్వమసి సేవా సమాజం ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. నవంబర్ 16 నుంచి జనవరి 20 వరకు మహా అన్నదాన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ డ్రాలో నలుగురిని విజేతలుగా ఎంపిక చేశారు. ఈ లక్కీ డ్రాలో వర్ని మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి సత్యనారాయణ మొదటి విజేతగా నిలిచి, విగ్రహాల సెట్‌ను గెలుచుకున్నారు. విజేతకు బహుమతిని కర్కసిద్ధు గురుస్వామి చేతుల మీదుగా సుబ్రమణ్యం గురుస్వామి, సత్యనారాయణ గురుస్వామి, గంగాధర్ గురుస్వామి, తిలక్ గురుస్వామి, ప్రదీప్ గురుస్వామి, సంగమేశ్వర్ స్వామి తదితరుల సమక్షంలో అందజేశారు.

క్రీడలతోనే స్నేహం పెంపొందుతుంది

అక్షరటుడే, ఎల్లారెడ్డి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని.. శారీరక దృఢత్వం వస్తుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి అన్నారు. మాచాపూర్ ప్రాథమిక పాఠశాలలో మండలస్థాయి సీఎం కప్ ఆటల పోటీలను ఆమె బుధవారం ప్రారంభించారు. క్రీడల్లో గెలుపుఓటములు సహజమని.. ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో గెలిచేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాచాపూర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాహేరా బేగం, ఎల్లారెడ్డి మండలం సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు నర్సింలు, పీడీ లాల్ సింగ్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు మృతి



అక్షరటుడే, కోటగిరి: పోతంగల్ మండలం కొల్లూరు గ్రామపంచాయతీలో 30ఏళ్లుగా సపాయి కార్మికుడిగా పనిచేసిన గోంటి సాయిలు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల నిమిత్తం గ్రామపంచాయతీ నుంచి రూ. 10వేలను సర్పంచ్ జగన్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారి సుభాష్, రాము, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పొలంలో కలుపు తీసిన విద్యార్థులు

తెలంగాణ మోడల్ స్కూల్ బాల్కొండలోని 9వ తరగతి విద్యార్థులు ఒకేషనల్ ఎడ్యుకేషన్ (అగ్రికల్చర్)లో భాగంగా పొలంలో కలుపు తీశారు. అదేవిధంగా పొలంలో వచ్చే రోగాలు, కలుపు నివారణల గురించి పిల్లలకు ఒకేషనల్ ట్రైనర్ ఆశం ప్రేక్షణ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్, కౌముది తదితరులు పాల్గొన్నారు. – అక్షరటుడే, బాల్కొండ

పోగొట్టుకున్న సెల్ ఫోన్ల రికవరీ

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్ హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులైన లక్ష్మణ్, వీ.రెడ్డి, మారుతిలకు బుధవారం అందజేసినట్లు తెలిపారు.

అజిత్ పవార్ మృతి పట్ల సంతాపం

అక్షరటుడే, ఆర్మూర్: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం పాలవ్వడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహారాష్ట్ర రాజకీయాలలో గొప్ప రాజకీయ నాయకుడిగా ఎదిగి ఇటీవలే ఉప ముఖ్యమంత్రి అయిన అజిత్ పవార్ మరణం కలిచివేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.